సాక్షి ఆదిలాబాద్

శనివారం । 21 । జూన్ । 2025



ఒంటికి యోగా మంచిదేగా..

ఆరోగ్యకరమైన జీవితానికి యోగా దివ్యఔషధం. దీనిపై అన్ని వర్గాల్లోనూ ఆసక్తి పెరుగుతోంది. నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కథనం. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
34.0/26.0

వాతావరణం

ఆకాశం పలుచోట్ల మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

చదువుతోనే సమాజంలో గుర్తింపు



లక్కీడ్రా నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్

ఆదిలాబాద్‌రూరల్: చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని అదనపు కలెక్టర్ శ్యామలాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా బెస్ట్ అవైలబుల్ స్కీంలో 1, 5వ తరగతుల్లో ప్రవేశాల కోసం శుక్రవారం లక్కీడ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. 1వ తరగతిలో 45 మంది, 5వ తరగతిలో 47 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎంపిక చేసిన ఏడు ప్రైవేట్ పాఠశాలల్లో వీరికి ప్రవేశం కల్పించి పదో తరగతి వరకు ఉచితంగా విద్య అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నతస్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇందులో డీఎస్‌సీడీవో సునీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, డీసీవో లలిత, నారాయణ రెడ్డి, నర్సింగ్, పూర్ణచందర్, ఎస్సీ కుల సంఘాల నాయకులు కొప్పుల రమేశ్, నక్క రాందాస్, మల్యాల మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు మెమో జారీ

సాక్షి ఎఫెక్ట్..

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌లో గల ప్రాథమిక పాఠశాల సమయానికి ముందే బంద్ చేసి ఉండగా శుక్రవారం 'సాక్షి'లో 'చినుకు పడితే బడి మూశారట' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంఈవో స్పందించారు. ఈమేరకు మండల విద్యాధికారి ఆశన్న శుక్రవారం పాఠశాలను సందర్శించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు మెమో జారీ చేశారు.

ఉన్నతస్థాయికి ఎదగాలి



వైష్ణవిని అభినందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: పోలీసుల పిల్లలు బాగా చదివి అత్యున్నత స్థాయికి ఎదగాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. పోలీసు ముఖ్య కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు కనకపూనరాం కూతురు వైష్ణవికి ఐఐటీ ముంబైలో సీటు లభించింది. ఈమేరకు జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఆమెను శుక్రవారం శాలువాతో సత్కరించారు. ఇందులో అదనపు ఎస్పీ సురేందర్ రావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటి, చంద్రశేఖర్, పోలీసు సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

బాధిత కుటుంబానికి అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఈ ఏడాది మార్చిలో అనారోగ్యంతో మృతిచెందిన హెడ్‌కానిస్టేబుల్ ఆర్.దిగంబర్ కుటుంబానికి శుక్రవారం రూ.8లక్షల భద్రత చెక్కును అందజేశారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సిబ్బందిని పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేయాలని సూచించారు. ఆయన వెంట ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్, సీఐ మొగిలి, ఎస్సై సాయన్న, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో బల్దియా అధికారులు



వర్క్‌షాప్‌లో పాల్గొన్న కమిషనర్, ఎంఈ

కై లాస్‌నగర్: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో శుక్రవారం నిర్వహించిన మున్సిపల్ అధికారుల రాష్ట్రస్థాయి వర్క్‌షాపునకు ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు, ఎంఈ పేరి రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్ హాజరయ్యారు. మున్సిపాలిటీల్లో సంస్కరణలు అమలు చేయడం ద్వారా తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణను సులభతరం ఎలా చేయవచ్చనే అంశాలపై వివిధ రాష్ట్రాలకు చెందిన స్టార్టప్ కంపెనీల ప్రతినిధుల ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు.

సర్కారు.. వెలవెల!

బోథ్ నియోజకవర్గంలోని ఓ మండలంలో ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండగా, మూడు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు కొనసాగుతున్నాయి. ఈ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉంది. ఆ మండలం, జిల్లా కేంద్రంతో పాటు ఆదిలాబాద్ వైపు మండలాల విద్యార్థులు అటువైపు వెళ్లి మరీ ప్రవేశాలు పొందుతున్నారు. అయితే ఇందులో చాలామంది కళాశాలకు వెళ్లకుండా పరీక్షకే హాజరవుతున్నట్లు తెలుస్తోంది.



ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెగ్యులర్ ప్రిన్సిపాల్‌తో పాటు 10 మంది లెక్చరర్లు ఉన్నారు. వీరంతా కళాశాలలు ప్రారంభం కాకముందే మండలంలోని చుట్టుపక్కల గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. తమ కళాశాలలో వసతులు, విద్యాబోధన తీరుపై అవగాహన కల్పించారు. ఈ కళాశాలలో మొత్తం 540 సీట్లు అందుబాటులో ఉండగా ఈ విద్యాసంవత్సరం ఇప్పటి వరకు కేవలం 30 మంది మాత్రమే ప్రవేశాలు పొందడం గమనార్హం.

- మండల, గ్రామీణ డిగ్రీ కళాశాలల్లో చేరేందుకే విద్యార్థుల ఆసక్తి
- పాస్ గ్యారంటీ అని నమ్మిస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలు
- ప్రభుత్వ కళాశాలల్లో పడిపోయిన ప్రవేశాలు
- జిల్లా కేంద్రంలోని కాలేజీల్లో పరిస్థితి మరింత దారుణం

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థుల ట్రెండ్ మారింది. సబ్జెక్టుపై పట్టు సాధించడం కాకుండా సులువుగా డిగ్రీ పట్టా పొందాలని ఆరాటపడుతున్నారు. గతంలో డిగ్రీ చదవాలంటే పల్లెల నుంచి పట్నానికి రావాల్సి వచ్చేది. సీటు దొరకడం కూడా గగనంగానే ఉండేది. విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టి మరీ పరీక్షల్లో సత్తా చాటేవారు. ప్రభుత్వ ఉద్యోగాలకు పోటీతత్వం పెరుగుతుండగా, దాన్ని అందిపుచ్చుకోవాల్సిన విద్యార్థులు అడ్డదారిలో డిగ్రీ సర్టిఫికెట్ పొందేందుకు యత్నిస్తున్నారు. వారి అమాయకత్వాన్ని పలు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఆసరాగా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నాయి. కళాశాలకు రాకపోయినా, పరీక్ష ఫీజు చెల్లించకపోయినా, ప్రాక్టికల్ పరీక్షలు చూసి రాయిస్తామని వారిని ఆకర్షిస్తున్నాయి. సెల్ఫ్ సెంటర్‌తో పాస్ గ్యారెంటీ అనే అభయం ఇస్తుండడంతో పేద విద్యార్థులతో పాటు జిల్లా కేంద్రంలోని విద్యార్థులు సైతం ఆయా మండలాలు, గ్రామాల్లోని కళాశాలల్లో చేరి పోతున్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైనప్పటికీ విషయ పరిజ్ఞానం లేకపోవడంతో పోటీ పరీక్షల్లో వెనుకడుగు వేయాల్సి వస్తోంది. జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలతో పాటు జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కళాశాలలు సైతం విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. కొన్ని ప్రైవేట్ కళాశాలలు ఎత్తివేసే ఆలోచనల్లో పడ్డాయి.

పాస్ గ్యారంటీ హామీ..

జిల్లాలో 25 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటితో పాటు ఆదిలాబాద్‌లో సైన్స్, ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలు, ఇచ్చోడ, ఉట్నూర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. అలాగే జిల్లా కేంద్రంలో మూడు రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలు కొనసాగుతున్నాయి. ప్రైవేట్ యాజమాన్యాలు విద్యార్థులు ఇంటర్ పాసైన వెంటనే వారి ఇళ్లకు వెళ్లి సర్టిఫికెట్లను తీసుకుంటున్నారు. వారే ఆన్‌లైన్ ద్వారా అప్లై చేసి తమ కళాశాలల్లో చేర్పించుకుంటున్నారు. విద్యార్థుల ఫోన్ నంబర్లకు బదులు కళాశాల యాజమాన్యం ఓటీపీలు ఇచ్చుకోవడంతో విద్యార్థులు ఏమి చేయలేని పరిస్థితి. అయితే ఇదివరకు ఉట్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ, బేల, తాంసి, తలమడుగు, బోథ్ తదితర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి వచ్చి విద్యార్థులు ఇంటర్, డిగ్రీ చదివేవారు. ప్రస్తుతం సీన్ రివర్స్ అయింది. జిల్లా కేంద్రంలోని కళాశాలలు విద్యార్థులు లేక వెలవెలబోతున్నాయి. తమ కళాశాలలో చేరితే పాస్ గ్యారంటీ.. కాలేజీకు రానవసరం లేదు.. సెల్ఫ్ సెంటర్ అంటూ ప్రలోభాలకు గురిచేస్తున్నారు. ఒక్కో విద్యార్థికి మూడేళ్లు చదివితే కళాశాల యాజమాన్యానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.45వేల నుంచి రూ.50వేల వరకు వస్తున్నాయి. చాలా ప్రైవేట్ కళాశాలల్లో తరగతులు నిర్వహించడం లేదు. ఒకరిద్దరు లెక్చరర్లతోనే నెట్టుకొస్తున్నారు. వారికి సైతం జీతాలు ఇచ్చే అవసరం లేకపోవడంతో విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్‌తో లబ్ధి పొందుతున్నారు.

మాస్ కాపీయింగ్‌పైనే..

చాలా మంది ప్రైవేట్ కళాశాలల్లో చదివే విద్యార్థులు మాస్ కాపీయింగ్‌పైనే ఆధారపడి ఉంటున్నారు. ఎలాగైనా పాస్ అవ్వాలనే ఆలోచనలో ఉండడంతో జిల్లాలోని ఆయా మండలాల్లోని ఉట్నూర్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, నేరడిగొండ, ఉండం, బేల కళాశాలలతో పాటు పలు కళాశాలల్లో చేరుతున్నట్లు సమాచారం. పరీక్షల సమయంలో ఆయా యాజమాన్యాలకు ఒక్కో పరీక్షకు రూ.200 నుంచి రూ.500 వరకు ఇస్తూ హాజరవుతున్నట్లు సమాచారం.

అడ్మిషన్లు లేక అయోమయం..

ఒకప్పుడు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో సీట్ల కోసం పోటీ పడేవారు. గత కొన్నేళ్లుగా పరిస్థితి భిన్నంగా మారింది. ఉన్న సీట్లు భర్తీ కావడం లేదు. అలాగే జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ కళాశాలల పరిస్థితి దారుణంగా ఉంది. కనీసం 50 మంది విద్యార్థులు కూడా చేరడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో తెలిసిపోతుంది. ఆదిలాబాద్ పట్టణంలోని సైన్స్ డిగ్రీ కళాశాలలో 660 సీట్లకు గాను కేవలం 170 మంది మాత్రమే చేరారు. ఆర్ట్స్ అండ్ కామర్ డిగ్రీ కళాశాలలో 540 సీట్లకు గాను 154 మంది చేరారు. ఇచ్చోడలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 540 సీట్లకు గాను 30 మంది విద్యార్థులు, ఉట్నూర్‌లో 840 సీట్లకు గాను దాదాపు 200 మంది చేరినట్లు ఆయా కళాశాలల యాజమాన్యాలు తెలిపారు.

ప్రైవేట్ ప్రలోభాలకు తలొగ్గొద్దు



ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు అన్ని మౌలిక వసతులు ఉన్నాయి. అర్హత గల లెక్చరర్లతో విద్యాబోధన ఉంటుంది. కొన్ని ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులను ప్రలోభాలకు గురిచేసి అడ్మిషన్లు చేయించుకుంటున్నారు. ఆయా కళాశాలల్లో తరగతులు పూర్తిస్థాయిలో జరగడం లేదు. ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు ఈ ఏడాది తక్కువగా నమోదయ్యాయి.

– ఎ.శ్రీనివాస్, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఇచ్చోడ

'ఉపాధి' పనుల్లో నాణ్యత పాటించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్రబృందం సభ్యులు

ఇంద్రవెల్లి: ఉపాధి హామీ పథకంలో రైతులకు అవసరమైన పనులు చేపట్టాలని, అలాగే పనుల్లో నాణ్యత పాటించాలని మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్ మెంట్ ప్రాజెక్ట్ అధికారి కిరణ్‌చరణ్ పదే అన్నారు. మండలకేంద్రంలోని ఎస్టీ కాలనీ, ప్రబుద్ధ నగర్, మిలింద్‌నగర్‌లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర బృందం సభ్యులు శుక్రవారం పరిశీలించారు. అలాగే ఇంద్రవెల్లి పరిధిలోని వ్యవసాయ భూములను సందర్శించి చేపట్టిన ఉపాధి పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ భూముల్లో చేపట్టే పనులు రైతులకు మేలు చేకూరేలా ఉండాలన్నారు. ఇందులో కేంద్ర బృంద సభ్యులు రఘుకుమార్, మురళీధర్, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఏఈ ప్రభుకిరణ్, టెక్నికల్ అసిస్టెంట్లు సంతోష్ జైస్వాల్, మహేందర్, ధమ్మనంద్, విఠల్, ప్రకాశ్ తదితరులున్నారు.

రైతుల ఖాతాల్లో రూ.212.74 కోట్లు జమ

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద వ్యవసాయ ఆధారిత రైతుల ఖాతాల్లో పంట పెట్టుబడి సాయం నిధులు జమ అవుతున్నాయని కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలోని 1,68,238 రైతులకు గాను ప్రభుత్వం రూ.342.3 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. భూ విస్తీర్ణం ఆధారంగా శుక్రవారం వరకు 1,33,808 మంది రైతుల ఖాతాల్లో రూ.212.74 కోట్లను జమ చేసినట్లుగా వివరించారు.

డీలర్ల మాయాజాలం!

- హోల్‌సెల్ వ్యాపారుల్లో పలువురు రిటైల్ కూడా..
- బిల్లుల ఎంట్రీలో జిమ్మిక్కులు
- నిఘా పెంచకపోతే యూరియా పక్కదారికి ఆస్కారం
- భీంపూర్ ఘటనే నిదర్శనం



గోదాములో యూరియా (ఫైల్)

సాక్షి,ఆదిలాబాద్: భీంపూర్ మండలం అందర్‌బంద్‌లో మంగళవారం యూరియా లోడ్‌తో వెళ్తున్న లారీని టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకున్న విషయం తెలిసిందే. దీనిపై విచారణ కొనసాగుతోంది. రైతు మిత్ర అనే హోల్‌సెల్ ట్రేడర్స్ నుంచి ఈ సరుకు లోడైనట్లు గుర్తించారు. భీంపూర్ వ్యవసాయ అధికారి విచారణ చేపట్టారు. 18 మంది రైతులకు సరఫరా చేసేందుకే ఇది వెళ్తున్నట్లు నిర్ధారించారు. అయితే ట్రేడర్ మొదట మ్యానువల్‌గా బిల్లులు రూపొందించారు. సరుకును రవాణా చేసిన తర్వాత ఈపాస్‌లో నమోదు చేశారు. రైతుల ఆధార్ నంబర్, వేలిముద్రల పరిశీలన అనంతరం లోడ్ పక్కదారి పట్టలేదని స్పష్టం చేస్తున్నారు. కొసమెరుపు ఏమిటంటే.. రైతుమిత్ర ట్రేడర్స్‌కు ఇటు హోల్‌సెల్‌తో పాటు రిటైల్‌లోనూ లైసెన్స్ ఉంది. జిల్లాలో ఇలా హోల్‌సెల్‌తో పాటు రిటైల్‌లో లైసెన్స్ కలిగిన వారు అనేకం ఉన్నారు.

ట్రేడర్స్ లైసెన్స్ సస్పెన్షన్..

భీంపూర్ మండలంలో లారీ లోడ్‌తో పట్టుబడ్డ యూరియా విషయంలో ట్రేడర్ రైతుల పేరుపైనే దీన్ని సరఫరా చేసినప్పటికీ మొదట మ్యానువల్‌గా నమోదు చేయడం, ఆ తర్వాత ఆన్‌లైన్ ఎంట్రీ చేయడం వంటిది తప్పుగానే వ్యవసాయ శాఖ పేర్కొంటుంది. అయితే దీన్ని సరిదిద్దుకునే తప్పుగా ఆ శాఖ పేర్కొంటుంది. సాధారణంగా రెండు రకాల పొరపాట్లు ఉంటాయని.. అందులో సరిదిద్దుకునే తప్పు ఒకటిగా.. సరిదిద్దుకోలేని తప్పు మరొకటిగా శాఖాపరంగా పేర్కొంటామని వివరిస్తున్నారు. లైసెన్స్ లేకుండా ఎరువులు విక్రయించడం సరిదిద్దుకోలేని తప్పుగా పేర్కొంటామని అంటున్నారు. అయినప్పటికీ రైతుమిత్ర ట్రేడర్స్ లైసెన్స్‌ను సస్పెన్షన్ చేశారు. తద్వారా ఇతర ట్రేడర్స్ కూడా యంత్రాంగం నుంచి హెచ్చరిక జారీ చేశారు.

హోల్‌సెల్, రిటైల్ వారే..

జిల్లాలో హోల్‌సెల్ ట్రేడర్స్ కలిగిఉన్న వారిలో పలువురికి రిటైల్ షాపులు కూడా ఉండటం గమనార్హం. ఇలాంటి దగ్గరే అధికంగా అక్రమాలకు ఆస్కారం ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలా లైసెన్స్ ఉన్నవారు సాధారణంగానైతే హోల్‌సెల్ నుంచి రిటైల్‌కు సరుకు వచ్చిన తర్వాతే రైతుల పేరిట ఈపాస్ ద్వారా విక్రయాలు జరపాలి. అయితే హోల్‌సెల్ గోదాం నుంచి నేరుగా సరుకును పక్కదారి పట్టించి అక్రమంగా విక్రయించేందుకు అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారులు నిరంతరం దృష్టి సారిస్తేనే అక్రమాలు అరికట్టేందుకు ఆస్కారం ఉంటుంది. లేనిపక్షంలో వ్యాపారులు ఆడిందే ఆట అన్నట్టుగా వ్యవహారం సాగేందుకు అవకాశం ఉంటుంది.

జిల్లాలో ఎరువుల డీలర్ల వివరాలు..

హోల్‌సెల్ డీలర్లు	24
రిటైల్ లైసెన్స్ కలిగి ఉన్న హోల్‌సెల్ డీలర్లు	21
రిటైల్ డీలర్లు	306

ఈపాస్‌లో ఎంట్రీ చేయాలి..

ఎరువుల విక్రయాలకు సంబంధించి ఈపాస్ మిషన్‌లో ఎంట్రీ చేసిన తర్వాతే విక్రయాలు చేయాలి. రైతుమిత్ర ట్రేడర్స్‌కు సంబంధించి లైసెన్స్‌ను సస్పెన్షన్ చేశాం. ఇతర ట్రేడర్లు కూడా నిబంధనల ప్రకారం వ్యవహరించాలి. లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవు.

– శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయ అధికారి

ఆస్తుల లెక్క.. ఇక పక్కా

- ప్రారంభమైన భువన్ సర్వే
- బల్దియాలో పకడ్బందీగా కొనసాగుతున్న ప్రక్రియ



పట్టణంలోని ఓ భవనం కొలతలు పరిశీలిస్తున్న బల్దియా సిబ్బంది

కై లాస్‌నగర్: పట్టణంలోని ఆస్తుల (అసెస్‌మెంట్) లెక్క ఇక పక్కాగా తేలనుంది. భువన్ యాప్ ద్వారా బల్దియా అధికారులు ప్రత్యేక సర్వేకు శ్రీకారం చుట్టారు. ఈనెల 17నుంచి క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ విస్తీర్ణం ఆధారంగా వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. నివాస గృహాలతో పాటు వాణిజ్యపరమైన భవనాలను సైతం పరిశీలిస్తున్నారు. వాటి ఆధారంగానే ఇక పన్ను మదింపు ఉంటుంది.

పక్కాగా పన్ను మదింపు..

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో 48,448 అసెస్‌మెంట్లు ఉండగా వాటికి గాను ఏడాదికి రూ.13.96 కోట్ల ఆస్తి పన్ను డిమాండ్ ఉంది. ఇందులో ఏటా సుమారు రూ.8 కోట్ల వరకు వసూలవుతున్నాయి. అయితే పన్ను విధింపులో అనేక అక్రమాలు జరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలు ప్రాంతాల్లో బల్దియా సిబ్బంది యజమానులతో కుమ్మక్కై చేతివాటం ప్రదర్శిస్తూ ఆస్తి విలువను తక్కువగా నమోదు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కొంతమంది వాణిజ్యపరమైన ఆస్తులను సైతం నివాసగృహంగా చూపించి తక్కువగా పన్ను చెల్లిస్తున్నారు. ఇలాంటి వాటికి చెక్ పెట్టేలానే ఉద్దేశంతోనే ప్రభుత్వం భువన్ యాప్ సర్వేకు ఆదేశించింది. ఇందులో భాగంగా బల్దియా సిబ్బంది ఇంటింటికి వెళ్లి జీపీఎస్ ట్రాకింగ్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. దీంతో ఆస్తి పన్ను మదింపు పక్కాగా ఉండటంతో పాటు వసూళ్లు సైతం పెరగనున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

సర్వే సాగుతుందిలా...

ఈ యాప్ ద్వారా పట్టణంలోని ఆస్తుల లెక్క తేల్చేందుకు 15 మంది బల్దియా బిల్ కలెక్టర్లను ఎంపిక చేశారు. వారికి ప్రత్యేకంగా యూజర్ ఐడీ, పాస్‌వర్డులతో కూడిన లాగిన్లను కేటాయించారు. వీరంతా తమకు కేటాయించిన వార్డులకు వెళ్లి క్షేత్రస్థాయిలో ఆస్తుల వివరాలను సేకరించనున్నారు. నివాస, వాణిజ్యపరమైన భవనాలను వెనుక, ముందు భాగాల్లో రెండు ఫొటోలు తీసుకుంటారు. వాటి విస్తీర్ణం ఎంత అనే కొలతలను లెక్కిస్తారు. భవన యాజమాని ఆధార్ నంబర్ నమోదు చేయగానే వారి వివరాలు కనిపించే అవకాశమున్నందున వీటి వివరాలను భువన్ యాప్‌లో జీపీఎస్ విధానంలో నమోదు చేస్తారు. గతంలో చేపట్టిన సర్వేలో మిగిలిపోయిన 8,478 ఆస్తులతో పాటు ఇటీవల కొత్తగా నమోదైన 10వేల ఆస్తులను సైతం ఇందులో నమోదు చేయనున్నారు. వాటి ఆధారంగా ఆ ఆస్తులకు పన్ను విధిస్తారు. అలాగే ప్రతీ ఆస్తికి 10 అంకెలతో కూడిన ప్రాపర్టీ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నంబర్ (పిటిన్)ను కేటాయిస్తారు. ఇలా వివరాలు పక్కాగా సేకరించడం ద్వారా బల్దియాకు పన్నుల రూపంలో మరింత ఆదాయం సమకూరే అవకాశముంది. సర్వే పర్యవేక్షణ కోసం బల్దియాలో ఐదుగురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు బాధ్యతలు అప్పగించారు. నాలుగు రోజుల క్రితం సర్వే ప్రారంభమైనట్లు అధికారులు వెల్లడించారు.

పట్టణంలో..

వార్డులు	49
ఓల్డ్ అసెస్‌మెంట్‌లు	8,478
న్యూ అసెస్‌మెంట్‌లు	10,980
సర్వేకు ఎంపిక చేసిన సిబ్బంది	15

పకడ్బందీగా సర్వే..

పట్టణంలోని ఆస్తులను పక్కాగా తేల్చేందు కోసమే ప్రభుత్వం భువన్ యాప్ ద్వారా సర్వే కు ఆదేశించింది. అందుకనుగుణంగా ఆస్తుల సర్వే చేపట్టాం. పకడ్బందీగా కొనసాగుతుంది. ఇప్పటి వరకు 628 ఇళ్ల వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేశాం.

– కళ్యాణ్, బల్దియా రెవెన్యూ అధికారి

పైలట్ ప్రజావాణి బహిరంగ విచారణ షెడ్యూల్ ఖరారు

- ఈ నెల 23నుంచి ప్రారంభం

కై లాస్‌నగర్: ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో పైలట్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రజలు మండలస్థాయి అధికారులకు తమ సమస్యలతో కూడిన దరఖాస్తులను అందజేస్తున్నారు. వాటిపై జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు బహిరంగ విచారణ నిర్వహిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. అయితే రెవెన్యూ సదస్సుల నిర్వహణ కారణంగా మే నెల నుంచి ఇప్పటి వరకు ఈ విచారణను నిలిపివేసింది. సదస్సులు ముగియడంతో తాజాగా బహిరంగ విచారణ తేదీలను ఖరారు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 23న భీంపూర్, సిరికొండ, 24న తాంసి, ఇచ్చోడ, 25న జైనథ్, గాదిగూడ, 26న బోథ్, ఉట్నూర్, 27న తలమడుగు, గుడిహత్నూర్, 28న బజార్‌హత్నూర్, ఆదిలాబాద్, 30న నార్నూర్, బేల, జూలై 1న నేరడిగొండ, ఇంద్రవెల్లి మండల కేంద్రాల్లో ప్రజావాణి బహిరంగ విచారణ ప్రక్రియ సభలు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి తెలిపారు. దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

కైలాస్‌నగర్: భూభారతి నూతన రెవెన్యూ చట్టం –2025 అమల్లో భాగంగా జిల్లాలో చేపట్టిన రెవెన్యూ సదస్సులు శుక్రవారంతో ముగిశాయి. జిల్లావ్యాప్తంగా 505 రెవెన్యూ గ్రామాల్లో ఈ నెల 3నుంచి 20 వరకు 40 ప్రత్యేక బృందాల ద్వారా సదస్సులు నిర్వహించారు. రైతులు, భూ బాధితుల నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో దరఖాస్తులు స్వీకరించారు. వాటిని ఆగస్టు 15 వరకు పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం తెలిసిందే. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

'పీఎం జన్‌మన్' సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డిప్యూటీ సెక్రెటరీ గణేశ్ నిరంజన్

ఉట్నూర్‌రూరల్: పీఎం జన్‌మన్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభారి అధికారి, డిప్యూటీ సెక్రెటరీ గణేశ్ నిరంజన్ అన్నారు. ఉట్నూర్ ఐటీడీఏలో ధర్తి అబ జనభాగిదారి అభియాన్ అవగాహన శిబిరానికి శుక్రవారం ఆయన హాజరయ్యారు. ముందుగా ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఆయనకు మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం మండలంలోని దంతన్‌పల్లి, కొలాంగూడ కమ్యూనిటి హాళ్లలో దాల్‌మిల్ శిక్షణ పొందుతున్న వారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. జన్‌మన్ పథకం ప్రజలకు చేరువయ్యేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. వైద్యాధికారులు ఏర్పాటు చేసిన సికిల్‌సెల్ శిబిరాన్ని పరిశీలించారు. ఎంత మంది బాధితులు ఉన్నారని డీఎంహెచ్‌వో నరేందర్‌రాథోడ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో సబ్‌కలెక్టర్ యువరాజ్ మార్మట్, డీటీడబ్ల్యూవో తిరుపతి, మాజీ సర్పంచ్ తిరుపతి, ఎఫ్‌డీవో రేవంత్, జిల్లా సార్‌మేడీ దుర్గు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సమాక గ్రామంలో..

ఇంద్రవెల్లి: మండలంలోని సమాక గ్రామ పంచాయతీ పరిధిలోని మారుతిగూడ పీవీటీజీ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మల్టీపర్పస్ సెంటర్ భవనాన్ని గణేశ్ నిరంజన్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. కొలాం గిరిజనులతో మాట్లాడారు. వారి స్థితిగతులు, జీవన విధానం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి వెంట ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉన్నారు.

బోథ్ మండలానికి ఏటీసీ మంజూరు

- పొచ్చెరలో ఏర్పాటుకు ఉత్తర్వులు
- మండలవాసుల్లో హర్షం

బోథ్: బోథ్ మండలానికి ఐటీఐతో పాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. దీనిని పొచ్చెర గ్రామంలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 46 కేంద్రాలను టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేస్తున్నట్లుగా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణాలు చేపట్టనుండగా, టాటా సంస్థ కోర్సులకు సంబంధించిన మిషనరీతో పాటు ఇతర సదుపాయాలు కల్పించనుంది. విద్యార్థులు ఆయా కోర్సులు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగ కల్పనే ధ్యేయంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించింది. ఒక్కో సెంటర్‌కు టాటా సంస్థ రూ.35కోట్లతో మిషనరీతోపాటు కోర్సులకు సంబంధించిన మెటీరియల్స్ అందించనుంది. ఏటీసీలో ఆరు కోర్సులు ప్రవేశపెట్టబోతున్నారు. మండలంలో ఏటీసీ ఏర్పాటుపై ఈ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సత్తా చాటుతున్న శ్రీజ, వరుణ్



ఆసనాలు వేస్తున్న శ్రీజ, వరుణ్

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు జిల్లాస్థాయి యోగా పోటీల్లో రాణిస్తూ అందరి ప్రశంసలు పొందుతున్నారు. పీడీ ఇమ్రాన్ రెండేళ్లుగా విద్యార్థులకు యోగాలో మెళకువలు నేర్పిస్తూ ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నారు. గతేడాది డిసెంబర్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ఎనిమిదో తరగతి విద్యార్థిని శ్రీజ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. నిజామాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంది. ఎనిమిదో తరగతి విద్యార్థి వరుణ్ గతేడాది సీఎం కప్ పోటీల్లో జిల్లా స్థాయిలో రాణించి హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడు.



అసాధ్యాలన్నింటినీ సుసాధ్యం చేసే మహోన్నత శక్తి యోగాకు ఉంది. ఈ భారతీయ పురాతన ప్రక్రియకు రోజురోజుకూ క్రేజ్ పెరుగుతోంది. ఇది ఎందరో ఆచరించి ప్రయోజనం పొందుతున్న దివ్య సాధనం. నిత్య జీవితంలో తప్పనిసరిగా మారిన శాస్త్రీయ వ్యాయామ సమ్మిళిత సంపద. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కథనం..

ఒంటికి యోగా మంచిదేగా..

- అన్ని వర్గాల్లోనూ పెరుగుతున్న ఆసక్తి
- నేడు నిత్యజీవితంలో భాగమైన వైనం
- మానసిక ప్రశాంతతకు దివ్య ఔషధం
- ఆరోగ్యకర జీవనానికి ప్రయోజనకరం
- వ్యాయామ సాధనాల సమాహారం
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



యోగా గురువులకు కేరాఫ్ ఇలేగాం

భైంసా/భైంసాటౌన్: మండలంలోని ఇలేగాం యోగా గురువులకు కేరాఫ్‌గా నిలుస్తోంది. పలువురు యోగా నేర్చుకుని ఉపాధిమార్గంగా మలుచుకున్నారు. అబ్దుల్ మతీన్ యోగా సాధన చేస్తూ గ్రామానికి చెందిన పలువురికి శిక్షణ ఇచ్చాడు. ఇతని వద్ద యోగా నేర్చుకున్న ఉప్పు రవీందర్, సీహెచ్ వీరన్న, గంగాధర్, కృష్ణకుమార్, పోతన్న డిగ్రీ పూర్తయ్యాక బెంగూర్‌లోని వ్యాస యూనివర్సిటీలో యోగాలో ఎమ్మెస్సీ పూర్తి చేశారు. అబ్దుల్ మతీన్ పంచాయతీ కార్యదర్శిగా ప్రభుత్వ ఉద్యోగం సాధించగా, రవీందర్, వీరన్న, పోతన్న ఇటీవల ఆయుష్ విభాగంలో యోగా శిక్షకులుగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. కృష్ణకుమార్ హైదరాబాద్‌లో ఉంటూ ఆన్‌లైన్ ద్వారా విదేశాల్లోని ఔత్సాహికులకు యోగాలో శిక్షణ ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. గంగాధర్ హైదరాబాద్‌లో యోగా శిక్షణ ఇస్తూ జీవనం సాగిస్తున్నారు.

బాసరలో శిక్షణ ఇస్తున్న



బాసరలో యోగా శిక్షణ ఇస్తున్న. పాఠశాల పిల్లలంతా జాతీయ స్థాయిలో రాణించారు. నేను చిన్నప్పుడు హైస్కూల్‌లో చదివేటప్పుడు యోగాసనాలు నేర్చుకున్నా. అవే ఆసనాలు నన్ను కోచ్‌గా మార్చాయి. ప్రస్తుతం ఎంతోమంది పిల్లలకు శిక్షణ ఇస్తున్న. యోగా నాకు ఆరోగ్యంతో పాటు ఉపాధినిస్తోంది. ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేస్తే ఏ ఇబ్బందులు ఉండవని సూచిస్తున్నా.

– కోకినోళ్ల మల్లేశ్

22ఏళ్లుగా సాధన



2003 నుంచే యోగా సాధన ప్రారంభించాను. 15సార్లు జిల్లాస్థాయిలో, 10 సార్లు రాష్ట్ర స్థాయిలో, ఏడుసార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. అంతర్జాతీయస్థాయి పోటీల్లోనూ పాల్గొన్నాను. ప్రస్తుతం నిజామాబాద్ యోగా అసోసియేషన్‌లో కార్యదర్శిగా, తెలంగాణ యోగా అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రిఫరీగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. యోగా సాధనతో ఇప్పటివరకు ఎలాంటి అనారోగ్య సమస్యలు దరిచేరలేదు.

– గంగాధర్, ఇలేగాం

ఆయుష్‌లో ఉద్యోగం



నేను 14 ఏళ్లుగా యోగా శిక్షకుడిగా చేస్తున్నాను. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాను. నా వద్ద యోగా నేర్చుకున్న విద్యార్థులు పలుసార్లు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించారు. ఫిబ్రవరిలో నిర్వహించిన జాతీయస్థాయి యోగా రిఫరీ డిప్లమో పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాను. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ అశోక్ అగర్వాల్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నాను. ప్రస్తుతం ఆయుష్ విభాగంలో యోగా ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తున్న.

– ఉప్పు రవీందర్, ఇలేగాం

ఉపాధినిచ్చింది



నేను 2005 నుంచి యోగా సాధన ప్రారంభించాను. గురువు అబ్దుల్ మతీన్ వద్ద యోగా నేర్చుకున్నాను. డిగ్రీ తరువాత యోగాలో ఎమ్మెస్సీ పూర్తి చేశాను. 2016లో ప్రణవ అథ యోగా ఇనిస్టిట్యూట్‌ను సొంతంగా ప్రారంభించి దాదాపు 300 మందికి శిక్షణ ఇచ్చాను. యోగా థెరపిస్ట్‌గా పనిచేస్తున్నాను. ఇటీవలే ఆయుష్‌లో యోగా శిక్షకుడిగా ఉద్యోగం పొందాను. యోగాతో ఆరోగ్యంతోపాటు ఉపాధి లభించింది.

– సీహెచ్ వీరన్న, ఇలేగాం


ఢిల్లీలో శిక్షణ ఇస్తున్న



ఇలేగాంలో యోగాసనాలు నేర్చుకున్న నేను ఢిల్లీలోని కార్పొరేట్ కంపెనీల ఉద్యోగులకు యోగా శిక్షణ ఇస్తున్న. పెళ్లి చేసుకుని ఢిల్లీలోనే స్థిరపడ్డాను. నా భాగస్వామి కూడా యోగా శిక్షణ ఇస్తోంది. యోగా నా జీవితాన్ని మార్చివేసింది. ఆరోగ్యం కోసం నేర్చుకున్న యోగా నాకు ఎంతో గుర్తింపు తెచ్చింది. టర్కి దేశంలోని ఇస్తాంబుల్ రాజధాని సమీపంలో విదేశీయులకు యోగా శిక్షణ ఇవ్వడం మరిచిపోలేను.

– కృష్ణకుమార్, ఇలేగాం

నాకు గర్వంగా ఉంది



26 ఏళ్ల క్రితం ఇలేగాం గ్రామానికి వెళ్లాను. అప్పట్లో బాపూజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశాం. యువకులకు రోజూ యోగా శిక్షణ ఇచ్చేవాళ్లం. ఇప్పుడు ఆ గ్రామం నుంచి ఆరుగురు యోగా కోచ్‌లుగా మారారు. ఎంతోమంది యువకులు యోగాసనాలు వేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు. వారిని చూస్తే నాకు గర్వంగా ఉంది.

– నాగేశ్, మనోరమ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్

జాతీయస్థాయిలో మెరిసిన గౌరి



జాతీయస్థాయిలో బంగారు పతకంతో గౌరి

భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్‌కు చెందిన గౌరి యోగా పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర, జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించింది. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న గౌరి కోచ్ ఉప్పు రవీందర్ శిక్షణలో యోగాసనాల్లో మెళకువలు నేర్చుకుంది. దాదాపు నాలుగేళ్లుగా యోగాలో శిక్షణ పొందుతూ పలుసార్లు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంది. గత సెప్టెంబర్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. కరీంనగర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండో స్థానం కైవసం చేసుకుంది. ఫిబ్రవరిలో పంజాబ్‌లోని లూధియానాలో యోగాసన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించింది.

ప్రశాంతంగా ఉండవచ్చు



లక్ష్మణచాంద: నిత్యం యోగా చేస్తే రోజంతా మానసికంగా ఎంతో ప్రశాంతంగా ఉండవచ్చు. శారీరక దృఢత్వం పెరుగుతుంది. నేను మూడు సంవత్సరాలుగా యోగా సాధన చేస్తున్నాను. మండల స్థాయిలో పలుసార్లు ప్రశంసలు పొందాను.

– శ్రీనిత్య, కేజీబీవీ విద్యార్థిని, లక్ష్మణచాంద

ఆరోగ్యానికి మేలు



లక్ష్మణచాంద: పరీక్షల సమయంలో నిత్యం యోగా సాధన చేస్తే ఒత్తిడిని జయించవచ్చు. యోగా మాలాంటి విద్యార్థినులకు ఎంతో మేలు చేస్తుంది. రెండు సంవత్సరాలుగా యోగా సాధన చేస్తున్నాను. పలువురి చేత ప్రశంసలు పొందాను.

– అమూల్య, కేజీబీవీ విద్యార్థిని, లక్ష్మణచాంద

యోగా గ్రామం.. రోటిగూడ



జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న హృషికేశ్‌తో తిరుపతి (ఫైల్)

జన్నారం: మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు యోగా పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచారు. గ్రామానికి చెందిన ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపతి గ్రామంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్నారు. 2018లో మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో శివనూరి హృషికేశ్ పాల్గొని ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించాడు. 2020లో ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఎనిమిది మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. 2024లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో శ్రీహాస ద్వితీయ స్థానంలో నిలిచింది.

20 ఏళ్ల కష్టానికి ప్రతిఫలం



చెన్నూర్: ప్రాథమికవిద్య స్థాయి నుంచే యోగాలో శిక్షణ పొందాను. సుమారు 20 ఏళ్లుగా యోగాతో సహవాసం చేశాను. పది మందికి నేర్పించాలనే సంకల్పంతో యోగా టీచర్ కోర్సు చేశా. ఐదేళ్ల క్రితం శిక్షణ పూర్తి కాగా ఆయుష్ యోగా మందిరాల్లో శిక్షకుడిగా చేరాలని ప్రయత్నించా. ప్రస్తుత ప్రభుత్వం గతేడాది ఆయుష్ యోగా మందిర్‌లో శిక్షకుడిగా నియమించింది. యోగా టీచర్‌గా యోగా మందిరంతో పాటు వివిధ ప్రాంతాల్లో శిక్షణ ఇస్తున్నా.

– మోర్ల మధూకర్, యోగా శిక్షకుడు

ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు



చెన్నూర్: సమయపాలన లేకుండా వివిధ పనులు చేస్తున్న ప్రజలు ఒత్తిడికి లోనై అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రతీరోజు ఉదయం, సాయంత్రం గంటపాటు యోగాకు కేటాయిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాల్సిన అవసరముంది. యోగాపై అవగాహన లేని వారంతా అంతర్జాతీయ యోగా డే సందర్భంగానైనా యోగా సాధన ప్రారంభించండి.

– ఇప్ప రజిత, ఆయుష్ యోగా మందిర్ శిక్షకురాలు

రిటైర్డయినా యోగా మాస్టర్‌గా..



యోగా మాస్టర్ భగవన్‌దాస్

లక్సెట్టిపేట: పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి రావల్లి భగవన్‌దాస్ పదేళ్లుగా యోగా సాధన చేస్తున్నారు. ఇతడి ప్రతిభను గుర్తించి బహుజన రైటర్స్ ఆధ్వర్యంలో బెస్ట్ యోగా మాస్టర్‌గా 2024లో హైదరాబాద్‌లో జాతీయ అవార్డు అందజేశారు. ప్రస్తుతం భగవాన్‌దాస్ మంచిర్యాల, లక్సెట్టిపేటలో శ్రీ యోగా ఉచిత శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి పలువురికి శిక్షణ ఇస్తున్నారు.

యోగాలో శ్రీనాథ్‌కు బహుమతులు

దండేపల్లి: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదోతరగతి విద్యార్థి శ్రీనాథ్ చదువుతో పాటు యోగాలో రాణిస్తున్నాడు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రవి ప్రోత్సాహంతో పలు యోగా పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించాడు. జిల్లా, జోనల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుపొందాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాడు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బహుమతి సాధించడమే తన లక్ష్యమని చెబుతున్నాడు.

ఆసనం వేస్తున్న శ్రీనాథ్





కల్లూరులో విద్యార్థులకు ఆసనాలు నేర్పిస్తున్న గజానన్

15 ఏళ్లుగా ఉచిత శిక్షణ

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన గజానన్ 15 ఏళ్లుగా యువకులు, మహిళలకు ఉచితంగా యోగాలో శిక్షణ ఇస్తున్నారు. గతేడాది ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో మండలానికి ఇద్దరు శిక్షకులను ప్రభుత్వం నియమించింది. వారు ఆయా పాఠశాలల ఆవరణల్లో, గ్రామపంచాయతీ కార్యాలయాల్లో నిత్యం యోగాలో మెళకువలు నేర్పిస్తున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రతీ గ్రామంలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. అందరూ ఆరోగ్యంగా ఉండాలంటే యోగా సాధన తప్పనిసరిగా అవసరం. గ్రామగ్రామాన యోగాసనాలు నేర్చుకునేందుకు విద్యార్థులు ముందుకువస్తున్నారు.

– సిర్ల మౌనిక, శిక్షకురాలు, కుంటాల

- డీసీసీబీ మాజీ చైర్మన్ హరీశ్‌రావు కిడ్నాప్ కేసు ఛేదించిన పోలీసులు

కిడ్నాప్ కేసులో ఆరుగురి అరెస్ట్

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లాలో ఈనెల 15న సంచలనం సృష్టించిన కిడ్నాప్, హత్యాయత్నం, దొంగతనం కేసును నిర్మల్ పోలీసులు ఛేదించారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ జానకీ షర్మిల వివరాలు వెల్లడించారు. మామడ మండలం పొన్కల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ హరీశ్‌రావు వద్ద అదే గ్రామానికి చెందిన షేక్ హైదర్ 2005లో డ్రైవర్‌గా పనిచేసేవాడు. హైదర్ ప్రవర్తన నచ్చక ఆరు నెలలకే హరీశ్‌రావు పని నుంచి తీసివేశాడు. దీంతో షేక్ హైదర్ హరీశ్‌రావుపై పగ పెంచుకున్నాడు. గుంటూరు జిల్లాకు చెందిన బానాల ప్రిన్స్, విజయవాడకు చెందిన తట్టూరి రవి, కళకంటి సురేశ్, గూడె కోటేశ్వరరావుతో కలిసి హరీశ్‌రావును ఈనెల 15 అర్ధరాత్రి అతడి ఇంటి నుంచి కిడ్నాప్ చేశారు. ఈ సందర్భంగా ఇంట్లో ఉన్న బంగారు చైన్, రెండు బంగారు బిల్లలు, డైమండ్ ఉంగరం, రూ.5వేల నగదు దొంగిలించారు. కారులో కత్తులతో బెదిరిస్తూ.. అతని బంధువులకు ఫోన్లు చేయించి రూ.3కోట్లు డిమాండ్ చేశారు. మార్గమధ్యలో మనోహరాబాద్ టోల్ ప్లాజా వద్ద కారు ఆపగా హరీశ్‌రావు వారి నుంచి తప్పించుకున్నాడు. సమాచారం అందుకున్న ఎస్పీ జానకీ షర్మిల వెంటనే ఏఎస్పీ రాజేశ్ మీనా నేతృత్వంలో ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నాలుగు రోజుల వ్యవధిలోనే నిందితులను చాకచక్యంగా పట్టుకున్నారు. వారి నుంచి కిడ్నాప్‌నకు వాడిన కారు, బాధితుడి కారు, బంగారు చైన్, బాధితుడి పర్సు, రూ.2వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు, రెండు కత్తులు, రెండు ఇంచుల ప్లాస్టర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కేసు ఛేదనలో చాకచక్యంగా వ్యవహరించిన ఏఎస్పీ రాజేశ్ మీనా, ఇన్‌స్పెక్టర్లు గోవర్ధన్‌రెడ్డి, కృష్ణ, సమ్మయ్య, ఎస్సైలు ప్రదీప్, శ్రీనివాస్, లింబాద్రి, శ్రీకాంత్, అశోక్‌ను ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ రాజేశ్ మీనా, రూరల్ సీఐ కృష్ణ

ఆర్జీయూకేటీకి 18,775 దరఖాస్తులు

- నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

భైంసా: 2025–26 విద్యాసంవత్సరంలో ఆర్జీయూకేటీలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు గడువు శనివారం ముగియనుంది. శుక్రవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 18,775 దరఖాస్తులు వచ్చాయని వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. చివరి రోజు మరిన్ని దరఖాస్తులు వస్తాయని పేర్కొన్నారు. జూలై 4న ప్రవేశాల మెరిట్ జాబితా విడుదల చేసి 7వ తేదీ నుంచి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బ్లేడ్‌తో కోసుకుని ఆత్మహత్యాయత్నం

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద పాత నిందితుడు అరుణ్ బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వస్తాద్ అరుణ్ అనే యువకుడిపై గతంలో కేసు నమోదు కాగా కోర్టు విచారణకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. శుక్రవారం పోలీసులు నిందితుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు అరుణ్ కోర్టుకు హాజరు కావాలని తెలుపగా ఇంటిలో లేడని తెలిపారు. ఈ క్రమంలో నిందితుడి కోసం గాలిస్తుండగా స్థానిక బస్టాండ్ వద్ద కనిపించాడు. పోలీసులు దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేయగా అరుణ్ తన దగ్గరున్న బ్లేడుతో గొంతు కోసుకునే ప్రయత్నంలో గాయాలయ్యాయి. దీంతో అప్రమత్తమైన పోలీసులు అరుణ్‌ను అదుపులోకి తీసుకుని చికిత్స కోసం రిమ్స్‌కు తరలించినట్లు ఇచ్చోడ సీఐ రాజు తెలిపారు. ప్రస్తుతం అరుణ్ చికిత్స కోలుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఇతడు గతంలోనూ బ్లేడుతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనే ఎస్సై, హోంగార్డ్‌లపై దాడి చేసి గాయపరిచాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

రెబ్బెన: మండల కేంద్రానికి చెందిన దర్మ వెంకటేశ్ (22) గురువారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. డ్రైవర్‌గా పనిచేస్తూ జీవించే వెంకటేశ్ ఏడాది కాలంగా మద్యానికి బానిసయ్యాడు. పని మానేసి జులాయిగా తిరుగుతుండేవాడు. పని చేసుకోవాలని తల్లి చంద్రకళ ఎంత చెప్పినా వెంకటేశ్ తన పద్ధతి మార్చుకోలేదు. గురువారం సాయంత్రం మద్యం సేవించి వెంకటేశ్ ఇంటికి రాగా తల్లి మందలించింది. భోజనాల తర్వాత ఇంటి పక్కనే నివాసముండే తన పెద్దమ్మ భారతి ఇంట్లో నిద్రిస్తానని వెంకటేశ్ వెళ్లాడు. కొద్ది సేపటికే చంద్రకళ భారతి ఇంటికి వెళ్లి చూడగా వెంకటేశ్ ఇంటి పైకప్పు ఇనుప పైపునకు ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.